
మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
epaper.manachourasta.com




సంపుటి : 01 | సంచిక : 17 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 13 డిసెంబర్ 2025 | పేజీలు : 04

## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా
# ముందుకు సాగాలి

- సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం..
- ప్రజా పాలనకు ప్రజలు పట్టం కట్టారు
- మంత్రి పొన్నం ప్రభాకర్

2





# సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** అందరి భాగస్వామ్యం, సమన్వయంతో మొదటి విడత ఎన్నికలు సజావుగా ముగిశాయని, 2, 3వ విడత ఎన్నికల్లో కూడా ఇదే విధంగా పనిచేసి సక్సెస్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈ నెల 14, 17వ తేదీన జరిగే ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర పోలింగ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో, మూడో విడత పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సరిగ్గా నిర్వహించాలని, చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్ పంపిణీ జరగాలని, పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని, ఓటింగ్ కి సంబంధించి ఇచ్చే నివేదికలన్ని పూర్తి సమాచారంతో ఉండాలన్నారు. వార్డ్, సర్పంచ్ ఎన్నికకు సంబంధించిన బ్యాలట్ పేపర్ రెండిటిని ఓటర్లు బ్యాలట్ బాక్స్ లో వేయాలని అలాగే రెండింటి మీద స్వస్తిక్ గుర్తును ఇంక్ తో పూర్తిగా అంటించి ఓటర్లు పెట్టాలన్నారు. ఈ అంశం మీద అక్కడ ఉండే పోలింగ్ అధికారులు ఓటర్లకు తెలియజేయాలన్నారు. పోలింగ్ అయిపోగానే...రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ జాగ్రత్త గా జరగాలన్నారు. వేగవంతంగా జరిగేందుకు అవసరమగు సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ కూడా వెంటనే అయిపోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మండల స్పెషల్ అధికారులు సమన్వయంగా పని చేసి పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు.



# గ్రామాభివృద్ధి లక్ష్యంగా ముందుకు..

- మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భీమదేవరపల్లి, ఎలకతుర్తి మండలాల్లో విజయం సాధించిన సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, వార్డుసభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం అభినందించి సత్కరించారు. ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను వివరించారు.

## గ్రామాభివృద్ధే.. ప్రభుత్వ లక్ష్యం

తెలంగాణ గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి, ఎలకతుర్తి మండలాల్లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసి, కాంగ్రెస్ పార్టీ గణనీయమైన స్థానాలను కైవసం చేసుకుంది. భీమదేవరపల్లిలో 15 స్థానాలు, ఎలకతుర్తి మండలంలో 11 గ్రామపంచాయతీలు కాంగ్రెస్ పక్షాన నిలిచాయి. సర్పంచ్లు పార్టీల గుర్తులు లేకుండా గెలిచినా, ప్రజలు తమ విశ్వాసాన్ని ఏ పార్టీకైతే వేశారు, ఆ ఆశలను నిలబెట్టే బాధ్యత మనందరిది అని మంత్రి పేర్కొన్నారు.

## ప్రజా పాలన..

మొదటి దశలోనే ఇంద్రమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, రెండో దశకు సంబంధించిన ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందని అర్హులకు వెంటనే సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని, కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియలో భాగమే అన్నారు.

## గ్రామాల్లో స్టీల్ బ్యాంక్..

ప్లాస్టిక్ నిర్మూలన కోసం హుస్నాబాద్ నియోజకవర్గం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి గ్రామానికి స్టీల్ బ్యాంక్ పంపిణీ చేసి హోటళ్ళలో కూడా వాటి వినియోగం తప్పనిసరి చేసినట్లు చెప్పారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, సన్న బియ్యం పంపిణీ, రైతులకు బోనస్, రుణమాఫీ వంటి పథకాలు కొనసాగుతున్నాయని తెలిపారు.


## సర్పంచ్లకు ప్రత్యేక శిక్షణ

నియోజకవర్గంలోని 173 గ్రామపంచాయతీల సర్పంచ్లందరికీ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి ప్లాన్ ఆఫ్ యాక్షన్ పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు.

## ప్రజా మద్దతు కోరిన మంత్రి

ఈ నెల 14న చిగురు మామిడి ఎన్నికలు, 17న హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, సైదాపూర్ మండలాల్లో రెండో దశ పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు. "మీ ఆశీర్వాదమే మా బలం. అభివృద్ధి కోసం మీతో కలిసి అడుగు వేస్తున్నాం. హుస్నాబాద్ పేరు రాష్ట్రవ్యాప్తంగా గౌరవంగా మారేలా కృషి చేస్తాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# జనగామ జిల్లా కలెక్టర్‌కు జల్ ప్రహరీ సమ్మాన్ పురస్కారం




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మరో అవార్డు దక్కింది. భూగర్భ జల సంరక్షణ, నీటి పునరుద్ధరణ, నీటి వనరులపరిరక్షణ, వినూత్న పద్ధతులను అమలు చేసినందుకు డిస్ట్రిక్ట్ గ్రౌండ్ వాటర్ అసెస్మెంట్ రిపోర్ట్ లో జిల్లాలో భూగర్భ జలాలు పెరిగినట్లు గుర్తింపు కలెక్టర్కు జల్ ప్రహరీ సమ్మాన్ పురస్కారం అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జనగామ జిల్లా కలెక్టర్కు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తూ పలువురు అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థులదే హవా!

- ప్రభుత్వంపై విశ్వాసానికి ఇదే నిదర్శనం
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘనవిజయం సాధించడంపై కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో 70 శాతం స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలవడం కాంగ్రెస్ ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దంపట్టే ఈ ఫలితాలు ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన, సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజాపాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మా దేవుని శ్రీనివాస్ అన్నారు . సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి నినాదానికి ప్రజలు పట్టం కట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్ కు మద్దతు తెలపడం గ్రామా పాలన వ్యవస్థలో నూతన దిశకు సాంకేతం అని ఆయన వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి, ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.



# పోస్టల్ బ్యాలెట్ పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ స్వీకరణ విధానం, ధృవీకరణ ప్రక్రియ, బ్యాలెట్ బాక్సుల భద్రత, రికార్డు నిర్వహణ, సిబ్బంది సమన్వయం, సీసీ టీవీ పర్యవేక్షణ వంటి కీలక అంశాలను ఆయన సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, నియమావళి అమలు ముఖ్యమని అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, ఎటువంటి అంతరాయం లేకుండా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అధికారులంతా బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట జనగామ ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారు.



# మల్లన్న కళ్యాణానికి ఆగమ పండితులు

**కొమురవెల్లి, మన చౌరస్తా:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొమరవెల్లి మల్లికార్జున స్వామికి ఆదివారం రోజున జరగబోయే కళ్యాణానికి వీర శైవ ఆగమ సాంప్రదాయ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మహా మండలేశ్వర్, డాక్టర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ స్వామీజీ శనివారం రోజున కొమురవెల్లికి విచ్చేయనున్నారు. మల్లన్న కళ్యాణం జరిగే పనులను తోట బావి ప్రాంగణమంతా తిలకించనున్నారు.

## మల్లన్న నిత్య ఆభరణాలు సిద్ధం

కొమురవెల్లి, మన చౌరాస్తా: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొమరవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చకచక సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఇటీవల గర్భాలయాన్ని మూసివేసిన అధికారులు స్వామి వారికి అలంకరించిన ఆభరణాలు త్రిశూలం, ఖడ్గం, కిరీటం, సామాగ్రి హైదరాబాద్ కు చెందిన కంసాలులు ఆదివారం జరగబోయే కళ్యాణానికి శుక్రవారం రోజున మెరుగు పట్టించి ఆలయ వర్గాలకు అందచేశారు.




# 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

- ఎన్నికల విధులకు డుమ్మా కొట్టిన వారిపై కలెక్టర్ సీరియస్

**జనగామ, మన చౌరాస్తా :** ఎన్నికల విధులకు గైర్హాజరైన 71 మంది అంగన్వాడీ, SGt, ఇతర ఉపాధ్యాయులు, అధికారులకు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా.. మొదటి విడత ఎన్నికల విధులకు 71 మంది అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు.ఎన్నికల విధులు చాలా కీలకమని, వీటికి హాజరు కాని 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇస్తూ... రెండవ విడత ఎన్నికల విధులను కేటాయించిన సంబంధిత ఎంపీడీఓ దగ్గరికి వెళ్లి రిపోర్ట్ చేయడం తో పాటు.. సంజాయిషీ రిపోర్ట్ ని ఎంపీడీఓ ద్వారా తమకి పంపించాలని ఆదేశించారు.

# పాలకుర్తిలో కాంగ్రెస్ జోరు

- పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** సర్పంచి ఎన్నికల తొలివిడత ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో మరింతగా దూసుకెళుతోంది. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి నియోజకవర్గంలోని తొర్రూరు పెద్దవంగర, పాలకుర్తి, దేవరుప్పల, కొడకండ్ల మండలాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పల్లెల్లో పర్యటిస్తూ సర్పంచ్ అభ్యర్థులను ఓటేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు గెలిస్తే పల్లెలు మరింతగా అభివృద్ధి చెందుతాయని వారు తెలిపారు. కళాకారుల ప్రదర్శనలు, బృందం సభ్యుల ఆటపాటలతో ప్రచార హోరు మరింత ఉత్సాహంగా సాగింది. యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి ప్రసంగాలతో ప్రజలు హోరెత్తారు.



# సురేందర్‌కు జాతీయ స్థాయి అవార్డు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భారతీయ దళిత సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నేడు న్యూ ఢిల్లీలో జరిగిన 41వ జాతీయ సదస్సులో, తెలంగాణ రాష్ట్రం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక వేత్త, బీసీ ఉద్యమ నాయకుడు మండల సురేందర్ పద్మశాలి జాతీయ స్థాయి గౌరవాన్ని అందుకున్నారు. 2025 సంవత్సరానికి గాను ప్రఖ్యాతమైన మహాత్మా జ్యోతి భాపులే నేషనల్ ఫెలోషిప్ అవార్డును అకాడమీ అధ్యక్షులు డాక్టర్ ఎస్. సుమనాక్షర్ చేతుల మీదుగా అందజేశారు. సామాజిక న్యాయం, బీసీ వర్గాల హక్కుల సాధన, బహుజన సమాజ అభ్యున్నతికి నిరంతరం సాగించిన ఉద్యమాలు, గ్రామీణ స్థాయిలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు చేసిన కృషిని గుర్తిస్తూ మండల సురేందర్కు ఈ అవార్డును అకాడమీ ప్రకటించింది. అవార్డు స్వీకరించిన అనంతరం మండల సురేందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగే ఎంపికలో నాకు అవకాశమిచ్చిన డాక్టర్ జితేందర్ మను కి, అకాడమీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు దక్షిణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాని ఈ జాతీయ అవార్డు నా భాధ్యతను మరింత పెంచిందన్నారు. బహుజన సమాజం పురోగతికి,దళిత,బీసీ మైన్నార్టీ వర్గాల హక్కుల కోసం మరింత బలంగా పోరాడుతాను. సమాజంలో ఉన్న అంతరాలను తొలగించే దిశగా నన్ను నడిపించే శక్తిగా ఈ అవార్డును భావిస్తున్నాను అన్నారు. అలాగే తన సేవలను గుర్తించి, ఎంపిక ప్రక్రియలో సహకరించిన చిప్ప వెంకటేశ్వర్లు నేతకు కూడా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా నుంచి వచ్చిన ప్రముఖ రచయితలు, సామాజిక నాయకులు, దళిత బహుజన ఉద్యమకారులు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిరావు పులే ఆలోచనలను ప్రేరణగా తీసుకుని సమాజ మార్పు కోసం పనిచేసే నాయకులకు ఈ అవార్డును అకాడమీ ప్రతి ఏడాది ప్రదానం చేస్తోంది.




# అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం

**వరంగల్, మన చౌరాస్తా :** ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, వరంగల్ జిల్లా కలెక్టర్ వరంగల్ డాక్టర్ సత్య శారద, వరంగల్ జిల్లాలో చేపడుతున్న భూ సేకరణ ప్రాజెక్టు లైన మామునూరు ఎయిర్పోర్ట్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులలో ఆర్ అండ్ ఆర్ పురోగతిని శుక్రవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో వరంగల్, తహసిల్దార్ ఖిలా వరంగల్, జోనల్ మేనేజర్ టిజిఐసిసీ, ఏ డి ఎస్ ఎల్ ఆర్, తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో జీఎస్సార్ ప్రచారం

**భూపాలపల్లి, మన చౌరాస్తా :** భూపాలపల్లి మండలం రామ్నాయక్ తండా, కొంపల్లి, గుడాడ్ పల్లి, గొర్లవేడు గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మండల నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లో నాయకులు, గ్రామస్తులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీ తీసి, గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే చాలా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నాయకులు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.





# ప్రజా సంఘాలు బలపరిచిన స్వతంత్ర అభ్యర్థిని గెలిపించాలి

**కొమురవెల్లి మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ గ్రామ సిపిఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. 3 వార్డు ప్రచారంలో భాగంగా అభ్యర్థి దండు స్వర్ణలతరాజు శాలువాతో సన్మానం చేసి విజయ సంకేతనం అందించినారు. ఈసందర్భంగా అభ్యర్థి అనంతరం తేలు ఇస్తారి మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన సమస్యలు అభ్యర్థి గెలవగానే గ్రామ కోతుల వలన ప్రజలకు విద్యార్థులను 300 మందికి పైగా కరిచి గాయాలైన పరిస్థితి గ్రామంలోవుంది. గ్రామంలో కోతులను పట్టించి ఫారెస్ట్ లో వదిలే విధంగా నేను కృషి చేస్తాను అని అన్నారు.ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి,రేషన్ కార్డులు అంత్యోదయ కార్డులు వితంతు వికలాంగులకు వృద్ధులకు పింఛన్ అర్హులకు వచ్చే విధంగా చేసాను అని గ్రామంలో గ్రంథాలయం యువతకు ఓపెన్ జిమ్ గ్రామపంచాయతీ లావాదేవీలు నోటీస్ బోర్డులో ఏర్పాటు చేస్తాను అని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహం అందే విధంగా మరియు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండే విధంగా చూస్తాను తెలపారు. అభ్యర్థి దండు స్వర్ణలత రాజు మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడవాలంటే కత్తెర గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పుల్లంపల్లి సాయిలు, ఐద్వా గ్రామ అధ్యక్షురాలు పుల్లంపల్లి నరసవ్వ, కానుగుల రాజు, సున్నం యాదగిరి, ఎల్లయ్య, కర్రోళ్ల ఇందిరా, దండు నర్సింలు, తేలు నవనీత, కర్రోళ్ల రాకేష్ పాల్గొన్నారు.





# ప్రిసైడింగ్ అధికారులకు ట్రైనింగ్

**ధూల్మిట్ట, మన చౌరాస్తా :** దూల్మిట మండలంలో మూడో విడత ఎలక్షన్ నిర్వహించుటకు ట్రైనింగ్ ప్రోగ్రాము ట్రైని అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా స్థాయి మానిటరింగ్ శిక్షణ అధికారి సత్యనారాయణ , రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షలో ఎన్నికల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి మండల ప్రిసైడింగ్ ఆఫీసర్లకు వివరించారు. పోలింగ్ సమయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్స్ తగు అప్రమత్తతో ఉండాలని ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. ట్రైనింగ్ ప్రోగ్రాంలోఎంపీడీఓ వీరరాజు, మండల విద్యాధికారి మీనాంజనేయులు, ఎంపీవో మాధవ్ జాదవ్, ఎంపీడీఓ ఆఫీస్ స్టాఫ్, ప్రీసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.




## 3 రోజెస్.. రెండో సీజన్ రెడీ

తెలుగు ఓటీటీ ప్లాట్ ఫాం 'ఆహా' లో సూపర్ హిట్ అయిన '3 రోజెస్' వెబ్ సిరీస్ ఇప్పుడు రెండవ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సీజన్ 2 ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మొదటి సీజన్‌లో ఇషా రెబ్బా, పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ సీజన్ 2లో ఇషా రెబ్బాతో పాటు రాశీ సింగ్ మరియు కుషిత కల్లపు కొత్త 'రోజెస్'గా కనిపించనున్నారు. కమెడియన్ వైవా హర్షతో పాటు సత్య కూడా నవ్వులు పూయించడానికి రెడీగా ఉన్నారు. ఎస్.కె.ఎన్ నిర్మాణంలో, కిరణ్ కారవల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ డిసెంబర్ 13 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ ట్రైలర్‌ను మీరు కూడా చూసేయండి. ఈ వెబ్ సిరీస్‌కు కిరణ్ కె కరవళ్ళ దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్కేఎన్ నిర్మిస్తున్నాడు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**